సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 3 । జూన్ । 2025

I



చీనీ టన్ను రూ.30,800

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.30,800, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



పేరుకే 40 శాతం సబ్సిడీ

విత్తన వేరుశనగపై ప్రభుత్వం ప్రకటించిన రాయితీ పేరుకేనని రైతులు చెబుతున్నారు. క్వింటా విత్తనం రూ.9,300 దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేదంటున్నారు. IIలో

గరిష్ఠం/కనిష్ఠం
37.1°/22.3°

జిల్లా పరిధిలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



'టీబీ ముక్త్ భారత్ అభియాన్' పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: క్షయ(టీబీ)ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలను చైతన్యవంతులను చేయడంతో పాటు వైద్య, ఆరోగ్య శాఖ తరఫున సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీబీ నిర్మూలనకు 100 రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాఠశాలలు, పంచాయతీ రాజ్ సంస్థలు, స్వయం సహాయక బృందాలు, అంగన్‌వాడీలు, స్థానిక స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. టీబీపై అవగాహన పెంచి దాన్ని ఎదుర్కొనే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజా బేగం, డీఎల్‌టీఓ డాక్టర్ తిప్పయ్య, డీసీహెచ్ఎస్ మధుసూదన్, మలేరియా అధికారి లక్ష్మానాయక్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ రమణ, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



రేషన్ పంపిణీ వివరాలను తెలుసుకుంటున్న జేసీ అభిషేక్ కుమార్

నల్లమాడ: అవినీతి, అక్రమాలకు తావులేకుండా చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాలు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ డీలర్లను ఆదేశించారు. సోమవారం ఆయన నల్లమాడ -1 చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరుకుల పంపిణీని స్వయంగా పరిశీలించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్ణీత సమయాల్లో డీలర్లు అందుబాటులో ఉంటూ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. 60ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే సరుకులు అందజేయాలని సూచించారు. అనంతరం క్యూ ఆర్ కోడ్ గురించి డీలర్లకు అవగాహన కల్పించారు. జేసీ వెంట తహసీల్దార్ రంగనాయకులు ఉన్నారు.

సరిహద్దులో గెలిచినా.. ఊళ్లో ఓడిపోతున్నా

- కబ్జాకు గురైన తన భూమిని పరిరక్షించాలి
- వీడియో ద్వారా కోరిన బీఎస్ఎఫ్ జవాన్



జవాన్ నరసింహమూర్తి

అమరాపురం: సరిహద్దులో ఉంటూ దేశ రక్షణలో విజయం సాధిస్తున్న తాను స్వగ్రామంలో ఆస్తులను కాపాడుకోలేక ఓడిపోతున్నానంటూ ఓ జవాన్ ఆవేదనతో విడుదల చేసిన వీడియో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. అమరాపురం మండల పరిధిలోని ఉదుగూరుకు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ నరసింహమూర్తి కె.శివరం గ్రామంలో వివాహం చేసుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా మరో ప్రాంతంలో ఉన్న ఆయన ఆదివారం ఓ వీడియో విడుదల చేశారు. తనకు చెందిన 2.09 ఎకరాల భూమిని కె.శివరం గ్రామానికి చెందిన నాగరాజు కబ్జా చేశాడని ఆరోపించారు. తనకు హక్కుగా రావాల్సిన భూమిని సాగు చేయడానికి వెళితే నాగరాజు దాడులు చేస్తున్నాడని, రాళ్లు, కొడవలితో భయపెడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు ఇచ్చినా రెవెన్యూ అధికారులు, పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. జవాన్ వీడియో వైరల్ కావడంతో తహసీల్దార్ లక్ష్మీనరసింహ సోమవారం మధ్యాహ్నం కె.శివరం గ్రామానికి వెళ్లి సంబంధిత భూమిని పరిశీలించారు. డాక్యుమెంట్లను తీసుకురావాలని జవాన్ మామకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అలాగే వారికి రక్షణ కల్పించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

సాయం అందక.. సాగు సాగక





ఈ రైతు పేరు ఎస్. హరినాథరెడ్డి. కదిరి మండలం ముత్యాలచెరువు. ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసేవాడు. గత ఐదేళ్లు 'రైతు భరోసా' కింద వైఎస్ జగన్ సర్కార్ పెట్టుబడి సాయం సకాలంలో అందించడంతో ఉత్సాహంగా పంటలు సాగుచేసేవాడు. కానీ కూటమి సర్కార్ 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఇస్తామన్న రూ.20 వేలు నేటికీ ఇవ్వకపోవడంతో పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద చేతులు చాచాల్సి వస్తోందని వాపోతున్నాడు.



ఈ చిత్రంలోని రైతు పేరు మేకల లక్ష్మీనరసింహులు. తాడిమర్రి మండలం. మరవపల్లి గ్రామం. తనకున్న మూడెకరాల పొలంలో ఏటా ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేస్తున్నాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయంతో పాటు రాయితీ విత్తన వేరుశనగ అందించడంతో పంటలు సాఫీగా సాగు చేశాడు. కూటమి ప్రభుత్వం నేటికీ రైతులకు పెట్టుబడి సాయం, రాయితీ విత్తనం అందించలేదు. దీంతో పెట్టుబడులకు డబ్బులు లేక ఏం చేయాలో తెలియక లక్ష్మీనరసింహులు సతమతమవుతున్నాడు. ఈ సారి పంట సాగుకు పెట్టుబడి ఎలా అని ఆందోళన చెందుతున్నాడు.

అన్నదాత దుఃఖీభవ..!

- 'అన్నదాత సుఖీభవ'కు పడని అడుగులు
- రైతులకు రూ.560 కోట్లు చంద్రబాబు ఎగనామం
- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురు చూపు
- ఖరీఫ్ సాగుకు 'ప్రైవేటు' అప్పులు చేస్తున్న వైనం

వైఎస్ జగన్ ప్రభుత్వం జిల్లా రైతులకు చేకూర్చిన రైతు భరోసా లబ్ధి ఇలా..

సంవత్సరం	రైతులు	నగదు లబ్ధి (రూ.కోట్లలో)
2019-20	2,56,170	345.83
2020-21	2,78,337	375.75
2021-22	2,70,443	359.80
2022-23	2,68,947	364.24
2023-24	2,79,556	321.47
మొత్తం	2,79,556	1767.09

జగన్ హయాంలో అన్నదాతకు ఆర్థిక భరోసా..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాల కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గతంలో వైఎస్ జగన్ సర్కారు సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతలకు అండగా నిలిచింది. 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా వచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటాగా మరో రూ.7,500 కలిపి మొత్తం రూ.13,500 'వైఎస్సార్ రైతు భరోసా' పేరుతో ఏటా నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. జిల్లాలోని 2,79,556 మంది రైతులకు గత ఐదేళ్లలో కేవలం వైఎస్సార్ రైతు భరోసా ద్వారానే రూ.1,767.09 కోట్ల లబ్ధి చేకూర్చింది.

కదిరి: రైతులకు కష్టం కలగకుండా చూసుకుంటానంటూ ఎన్నికల వేళ హామీలిచ్చిన చంద్రబాబు...అధికారంలోకి వచ్చాక రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ఏడాది పాలన సంబరాలకు సిద్ధమవుతున్న ఆయనకు..ఈ ఏడాది కాలంలో ఏనాడూ అన్నదాతలు గుర్తుకు రాలేదు. అందుకే రైతన్నలకు నయాపైసా సాయం చేసిన పాపాన పోలేదు. ఫలితంగా సాయం అందక...సాగుకు సన్నద్ధం కాలేక రైతన్న సతమతమవుతున్నాడు. తప్పనిసరి పరిస్థితుల్లో చాలా మంది రైతులు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెస్తున్నారు.

రూ.560 కోట్లు ఎగనామం..

'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల చొప్పున నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా..దానిపై ఉలుకూ పలుకూ లేదు. కేంద్రం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' ద్వారా రైతులకు సకాలంలో ఆర్థిక చేయూత ఇస్తున్నా.. చంద్రబాబు మాత్రం నోరు మెదపడం లేదు. టీడీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అదిగో..ఇదిగో అని చెప్పడమే కానీ రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది లేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏనాడూ రైతుల పక్షాన మాట్లాడ లేదు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఒక్కో రైతుకు రూ.20 వేల చొప్పున సుమారు రూ.560 కోట్లు చంద్రన్న సర్కారు ఎగ్గొట్టింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఇప్పటి దాకా ఎలాంటి ప్రకటన విడుదల కాలేదని వ్యవసాయాధికారులు అంటున్నారు.

మూడు విడతల్లో నిధులు జమ..

వైఎస్ జగన్ సర్కార్ ఖరీఫ్ సాగుకు ముందే ఏటా మే నెలలో 'వైఎస్సార్ రైతు భరోసా' కింద తొలివిడత రూ.7,500 ఇచ్చింది. తర్వాత అక్టోబర్ నెలలో పంట కోతతో పాటు రబీ సాగు అవసరాలకు రెండో విడతలో రూ.4 వేలు, జనవరి నెలలో మూడో విడతగా ధాన్యం ఇంటికి చేరే వేళ సంక్రాంతి పండుగ సమయంలో మరో రూ.2 వేలు... ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు మొత్తం రూ.13,500 చొప్పున నగదు రూపంలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే 'సున్నావడ్డీ-పంటరుణాలు' పథకం ద్వారా 1,71,275 మంది రైతులకు రూ.67.65 కోట్లు, 'డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా' ద్వారా 2,96,541 మంది రైతులకు రూ.718.57 కోట్లు, అదే విధంగా ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.16.21 కోట్లు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు గత ప్రభుత్వ హయాంలో లబ్ధి చేకూరింది. ఈ ప్రభుత్వం మాత్రం ఏడాది సంబరాలకు సిద్ధమవుతున్నా రైతులకు ఇచ్చిన మాట నిలుపుకోలేకపోయింది.

రైతు ద్రోహి ప్రభుత్వమిది



చంద్రబాబుకు రైతులంటే గిట్టదు. అందుకే ఆయన వ్యవసాయమే దండగ అని గతంలోనే చెప్పారు. ఎన్నికల వేళమాత్రం రైతులకు అలవిగాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. కానీ ఏడాది కాలంలో రైతులకు ఒరగబెట్టిందేమీ లేదు. పెట్టుబడి సాయం కూడా అందించలేదు. రైతు ద్రోహి ప్రభుత్వమిది. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకివ్వాల్సిన నగదు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. లేకపోతే రైతుల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటానికి సిద్ధమవుతుంది.

– ఉషశ్రీ చరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ

ఏడాదైనా పైసా ఇవ్వలేదు



ఎన్నికల సమయంలో చంద్రబాబు 'అన్నదాత సుఖీభవ' పథకం ద్వారా ఏటా ప్రతి రైతుకూ రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా పైసా ఇవ్వలేదు. ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీకి మంగళం పాడారు. ప్రస్తుతం పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వలేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– సూర్య శేఖర్‌రెడ్డి, నల్లచెరువు

సుఖీభవకు దిక్కులేదు



ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో పాటు కూటమి నాయకులంతా తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాత సుఖీభవ కింద ప్రతి సంవత్సరం రైతులకు రూ.20 వేల చొప్పున అందజేస్తామన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా రైతులకు చిల్లగవ్వ ఇవ్వలేదు.

– ఈశ్వర, నరసంపల్లి, కనగానపల్లి మండలం

ఒక్కో రైతుకు రూ.20 వేలు బాకీ



చంద్రబాబు రైతులకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. లేదంటే ఆ రైతుల ఆగ్రహానికి గురి కాక తప్పదు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున బాకీ పడింది. ఇప్పుడు మళ్లీ ఖరీఫ్ వచ్చింది.

– వేమయ్య యాదవ్, సీపీఐ జిల్లా కార్యదర్శి

నిధులు విడుదల కాలేదు



'అన్నదాత సుఖీభవ' పథకానికి సంబంధించిన నిధుల విషయంపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ప్రకటనా విడుదల కాలేదు. కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' కింద ఇస్తున్న నిధులు మాత్రం సకాలంలో జమ అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరలోనే నిధులు విడుదల చేసి, రైతులకు అందించే అవకాశం ఉంది.

– వైపీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ అధికారి

'వెన్నుపోటు దినం' విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి
- హామీలు తుంగలో తొక్కడం చంద్రబాబు నైజం: వెన్నపూస రవీంద్రారెడ్డి




పార్టీ శ్రేణులతో కలిసి 'వెన్నుపోటు దినం' పోస్టర్లను విడుదల చేస్తున్న రమేష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి

పుట్టపర్తి: రాష్ట్రంలోని అన్ని వర్గాలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ నెల 4న నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, వైఎస్సార్ సీపీ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని హిందూపురం పార్లమెంట్ పార్టీ పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్‌రెడ్డి, పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వారు పుట్టపర్తి పార్టీ కార్యాలయంలో జిల్లాలోని అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'వెన్నుపోటు దినం' పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. చంద్రబాబు అసమర్థ పాలన, హామీలు విస్మరించిన వైనాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు పసుపు-కుంకుమ, రైతు రుణమాఫీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, పీఠంపై కూర్చోగానే మహిళలకు, రైతులకు వెన్నుపోటు పొడిచారన్నారు. గత ఎన్నికలకు ముందు 'సూపర్ సిక్స్' హామీలతో పాటు వందల హామీలిచ్చి చంద్రబాబు పొత్తులతో అధికారంలోకి వచ్చారని, ఇప్పుడూ హామీలు అమలు చేయకుండా మోసం చేశారన్నారు. మోసం, వంచన, వెన్నుపోటు చంద్రబాబు నైజమన్నారు. 1996లోనే బిడ్డనిచ్చిన మామకు వెన్నుపోటు పొడిచి అక్రమంగా పదవి పొందారని, 2024లో అధికారంలోకి వస్తూనే ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. 4వ తేదీ పుట్టపర్తి దద్దరిల్లిల్లేలా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించాలన్నారు.

మోసం చేయటమే చంద్రబాబు లక్ష్యం..

హామీలివ్వడం.. మోసం చేయడం చంద్రబాబు నైజమని వెన్నపూస రవీంద్రరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 4వ తేదీన ఆయా నియోజకవర్గాల కేంద్రాల్లో జరిగే 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణ, పుట్టపర్తి రూరల్ మండల ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా అగ్రీ అడ్వయిజరీ మాజీ అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి వైస్ చైర్మన్ తిప్పన్న, పుట్టపర్తి, హిందూపురం నియోజకవర్గ మహిళా అధ్యక్షులు కన్యా కుమారి, కవితారెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గంగిశెట్టి, పుట్టపర్తి నియోజకవర్గం డాక్టర్ల విభాగం అధ్యక్షుడు హనుమంతరెడ్డి, సాయి, రామాంజనేయులు, నియోజకవర్గ ఐటీ విభాగం అధ్యక్షుడు గంగిరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బడా నాగార్జునరెడ్డి, కొత్తచెరువు ఐటీ విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు 20,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం నాటికి 20,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కొన్ని రోజులుగా డ్యాం ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో మొదలైంది. మూడు రోజులుగా వరద చేరిక పెరిగింది. మే మొదటి వారంలో ఇన్‌ఫ్లో జీరోగా ఉండగా.. నేడు 20,025 క్యూసెక్కులుగా నమోదవుతుండటం గమనార్హం. అవుట్ ఫ్లో 236 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం జలాశయంలో 1,633 అడుగులకు గాను 1,597.84 అడుగులకు నీరు చేరింది. మొత్తం నీటి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 18.860 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,577.47 అడుగుల వద్ద 3.360 టీఎంసీల నీటి నిల్వతో 411 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండింది.

'జేఈఈ అడ్వాన్స్‌డ్'లో జిల్లా విద్యార్థుల సత్తా



ఓంకిరణ్



అనీష్‌రెడ్డి

కదిరి టౌన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో కదిరికి చెందిన ఉపాధ్యాయుడు ఓబులపతి కుమారుడు ఓంకిరణ్ ఆల్ ఇండియా జనరల్ కేటగిరిలో 1,355 ర్యాంకు సాధించాడు. ఓబీసీ కోటాలో ఓంకిరణ్‌కు 223 ర్యాంకు దక్కింది. అదే విధంగా నల్లమాడ మండలం వంకరకుంట గ్రామానికి చెందిన కేవీ రమణారెడ్డి కుమారుడు కుడుము అనీష్‌రెడ్డికి ఆల్ ఇండియాలో 1,783 ర్యాంకు సాధించాడు. తమ తల్లితండ్రులు ప్రోత్సాహంతోనే మెరుగైన ఫలితాలు సాధించినట్లు ర్యాంకర్లు ఓంకిరణ్, అనీష్‌రెడ్డి తెలిపారు.

పొలాలకు దారి చూపించండి

- కలెక్టర్ టీఎస్ చేతన్‌కు కర్ణాటకనాగేపల్లి రైతుల మొర
- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 226 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారి-342 నిర్మాణం వల్ల తమ పొలాలకు దారి లేకుండా పోతోందని పుట్టపర్తి నగర పంచాయతీ కర్ణాటక నాగేపల్లి రైతులు కలెక్టర్ టీఎస్ చేతన్‌కు మొరపెట్టుకున్నారు. ఈమేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందించారు. కర్ణాటక నాగేపల్లి వెనుకభాగంగా ప్రభుత్వం నూతనంగా నాలుగే లేన్లతో ఎన్‌హెచ్- 342 నిర్మిస్తోందన్నారు. రహదారి తూర్పు భాగాన సుమారు 150 మంది రైతులకు చెందిన 300 ఎకరాల వ్యవసాయ పొలాలు ఉన్నాయని, జాతీయ రహదారి నిర్మాణం వల్ల పొలాలలోకి వెళ్లేందుకు దారి లేకుండా పోతోందని తెలిపారు. తమ పొలాలకు దారి చూపకపోతే తరతరాలు బాధ పడాల్సి వస్తుందన్నారు. అందువల్ల రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలోపు తమ పొలాలకు దారి చూపాలని కోరారు. స్పందించిన కలెక్టర్, సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులు, నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వానిలో పుట్టపర్తి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి, నాగశంకర్‌రెడ్డి, కేశవ, ఎరికల అంజనేయులు, ఈరప్ప, వడ్డి సత్యం, రాఘవేంద్ర, కె.సత్యంతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే అర్జీలకు గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు నుంచి 226 అర్జీలు అందగా... వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలతోపాటు, రీ సర్వే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటాలన్నారు. బుక్కపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ సంక్షేమ పథకాలు వంద శాతం అమలయ్యేలా అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్ కుమార్, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డీఎఫ్ఓ చక్రపాణి, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలా జ్యోతి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి సహదేవ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన వినతుల్లో కొన్ని ఇలా..

పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లిలో వారం రోజులుగా లోవోల్టేజీ సమస్య నెలకొందని, దీంతో టీవీలు, ఫ్రిజ్‌లు పలు ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపోతున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న విద్యుత్ అధికారులను ఆదేశించారు.

- ఓడీసీ బీసీ కాలనీలోని షిరిడీ సాయి గ్రామ సమైక్య సంఘం వీఓఏగా ఏళ్లుగా ఉన్న తనను అకారణంగా తొలగించారని, దివ్యాంగుడనైన తనకు న్యాయం చేయాలని మల్లిరెడ్డి పలువురు పొదుపు సంఘం మహిళలతో కలసి వచ్చి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ విచారించి న్యాయం చేయాలని అక్కడే ఉన్న డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు.

పొలాలకు దారి కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ ఇచ్చిన అనంతరం కలెక్టరేట్ అవరణలో కర్ణాటక నాగేపల్లి రైతులు



క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు రఫీక్

పెనుకొండ: స్థానిక దర్గాపేటలో నివాసముంటున్న దుస్తుల వ్యాపారి మహమ్మద్ రఫీక్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో వచ్చిన లాభంతో పాటు పెట్టుబడుల సొమ్మునూ తాగుడుకే ఖర్చు చేస్తుండడంతో కుటుంబసభ్యులు మందలించారు. అయినా మార్పు రాకపోవడంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రఫీక్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'పోలీసు స్పందన'కు 55 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 55 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, మహిళా డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దత్తానగర్‌లో చోరీ

కదిరి టౌన్: స్థానిక దత్తానగర్‌లో నివాసముంటున్న కదిరి బాలికల కళాశాల అధ్యాపకురాలు కవిత ఇంట్లో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి భోజనం ముగించుకుని కుటుంబసభ్యులందరూ నిద్రిస్తుండగా 11.30 గంటల ప్రాంతంలో దుండగులు బెడ్‌రూం కిటికీని ఇనుప కడ్డీలతో తొలగించి లోపలకు చొరబడ్డారు. బీరువాలోని 10 తులాల బంగారు నగలు, 4 కిలోల వెండి సామగ్రి, రూ.లక్ష నగదు అపహరించారు. సోమవారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేరుకే 40 శాతం సబ్సిడీ

- విత్తన వేరుశనగ క్వింటా ధర రూ.9,300గా నిర్ణయించిన ప్రభుత్వం
- 40 శాతం సబ్సిడీతో రైతుకు రూ.5,580కు
- బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన విత్తనం క్వింటా రూ.6,200కే
- ప్రభుత్వ నిర్ణయంపై అన్నదాతల అసంతృప్తి

ఖరీఫ్‌లో విత్తన వేరుశనగపై ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీపై అన్నదాతల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ సబ్సిడీతో తమకు ఒరిగేదేమీ లేదని వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు చెబుతున్నా.. 10 శాతానికి మించి సబ్సిడీ అందే పరిస్థితి లేదని అంటున్నారు.


వేరుశనగ విత్తన కాయలను పరిశీలిస్తున్న దృశ్యం

మడకశిర: ఈ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ విత్తన పంపిణీకి సంబంధించి ప్రభుత్వం క్వింటాకు రూ.9,300 ధర నిర్ణయించింది. దేశంలో ఏ రాష్ట్రంలోనూ క్వింటా వేరుశనగ ధర రూ.9,300 లేదు. అయితే రాష్ట్రంలో మాత్రం వేరుశనగ విత్తనానికి అధిక ధరను నిర్ణయించి రైతులకు 40 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు గొప్పలకు పోతోంది. 40 శాతం సబ్సిడీ పోను రైతులు క్వింటా వేరుశనగ విత్తనానికి రూ.5,580 చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన విత్తన వేరుశనగ క్వింటా ధర రూ.6,200 పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన వేరుశనగకు ఉన్న ధరతో పోల్చుకుంటే రైతులకు నామమాత్రంగానే సబ్సిడీ అందే పరిస్థితి కనిపిస్తోంది. బహిరంగ మార్కెట్‌లోని ధర ప్రకారం క్వింటాపై రైతులకు రూ.620 చొప్పున మాత్రమే సబ్సిడీ అందుతోంది. అయితే ప్రభుత్వ క్వింటాకు రూ.3,720 చొప్పున సబ్సిడీ ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం గమనార్హం.

బహిరంగ మార్కెట్‌లో కొనుగోలుకే మొగ్గు..

జిల్లాకు ఈ ఖరీఫ్ సీజన్‌లో 63,918 క్వింటాళ్ల విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకోగా... ధర గిట్టుబాటు కాకపోవడంతో చాలా మంది రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తన వేరుశనగ కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా వేరుశనగ విత్తనంపై అందించే సబ్సిడీ రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. సబ్సిడీ పోను ప్రభుత్వం అందించే ధరకే ఇంచుమించు బహిరంగ మార్కెట్‌లోనే నాణ్యమైన విత్తనం లభ్యమవుతోంది. దీంతో ఇప్పటికే చాలా మంది రైతులు రైతులు బహిరంగ మార్కెట్‌లోనే విత్తన కాయలను కొనుగోలు చేసి శుద్ధి చేసుకుంటున్నారు. ప్రభుత్వం అందించే విత్తనం కన్నా బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసిన విత్తనంలో 78 శాతం నాణ్యత ఉందని అంటున్నారు.

మభ్య పెడుతున్నారు



కూటమి ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలకు ఎక్కువ ధర నిర్ణయించి, అధిక సబ్సిడీ ఇస్తున్నట్లుగా మభ్య పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. 40 శాతం సబ్సిడీ ఇచ్చినా రైతులకు ఉపయోగం లేదు. సబ్సిడీ పోను కొనుగోలు చేసే వేరుశనగ విత్తనం అదే ధరకు బహిరంగ మార్కెట్‌లోనే దొరుకుతోంది. రైతులను మోసం చేయడం సరికాదు.

– హనుమంతరాయప్ప, శంకరగల్లు, గుడిబండ మండలం

సబ్సిడీ పెంచితేనే లాభం



ప్రస్తుతం వేరుశనగ విత్తనంపై ప్రభుత్వం అందిస్తున్న 40 శాతం సబ్సిడీ రైతులకు గిట్టుబాటు కాదు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి సబ్సిడీ మరింత పెంచాలి. కనీసం 70 శాతానికి సబ్సిడీ పెంచితేనే రైతులకు లాభదాయకంగా ఉంటుంది. 40 శాతం సబ్సిడీతో విత్తనం కొనుగోలు చేస్తే రైతులకు నష్టాలు తప్పవు.

– హనుమప్ప, ఇనగలూరు, అగళి మండలం

మోసం చేయడం బాధాకరం



వేరుశనగ విత్తన కాయలకు ఎక్కడా లేని విధంగా అధిక ధరను నిర్ణయించి రైతులను మోసం చేయడం బాధాకరం. విత్తన సేకరణ ఖర్చులను కూడా రైతులపై వేసి ధర నిర్ణయించడం దుర్మార్గం. ప్రభుత్వం క్వింటా వేరుశనగ విత్తనంపై పూర్తి ధర రూ.9,300 కాకుండా రూ.6 వేలు నిర్ణయించి 40 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలి.

– చిత్తయ్య, జీజీ హట్టి, రొళ్ల మండలం

తాగునీటి కోసం రాస్తారోకో


కూడేరులో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

కూడేరు: తాగునీటి కోసం కూడేరు వాసులు సోమవారం ధర్నా చేపట్టారు. మండల కేంద్రంలోని బోయ, కమ్మ, దళిత, కటిక వీధులు, శ్రీసత్యసాయి కాలనీల్లో పది రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా కాలనీ వాసులు సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కృష్ణమూర్తి మద్దతు పలికారు. విషయం తెలుసుకున్న సీఐ రాజు అక్కడికు ఆందోళన కారులతో చర్చించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్దకు వెళ్లి అక్కడ అధికారులతో మాట్లాడుకోవాలని సూచించారు. అయితే అధికారులే వచ్చి నీటి సమస్య తీరుస్తామని హామీ ఇచ్చేంత వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని మహిళలు తేల్చి చెప్పారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కుళ్లాయిస్వామి అక్కడకు చేరుకుని వారం రోజుల్లోపు కొత్తగా బోర్లు వేయించి, నీరు సరఫరా అయ్యేలా చేస్తామని భరోసానివ్వడంతో ఆందోళనను విరమించారు.

అక్రమాల 'శెట్టి' కొత్త పంథా

- తెలియక చేశాను.. ఆరు నెలల గడువివ్వండి అంటూ అభ్యర్థన
- కుదరదని తేల్చిచెప్పిన ఏపీఐఐసీ
- ఎవిక్షన్ పూర్తి చేయాలని ఆర్డీఓకు లేఖ

చిలమత్తూరు: తాను సాగించిన కబ్జాలపై రెడ్డప్పశెట్టి కొత్త పంథాను అందుకున్నారు. 'తెలియక చేశాను.. ఆక్రమించుకున్నది ఏపీఐఐసీ భూమి అని నాకు తెలియదు. ఆక్రమణలు తొలగించేందుకు ఆరునెలల సమయం ఇవ్వండి' అంటూ తాజాగా ఏపీఐఐసీకి లేఖ రాశారు. ఆద్యంతం చేసిన తప్పులు, ఆక్రమణలు, అక్రమాలను నుండి ఎలా తప్పించుకోవాలో ప్రయత్నాలు చేస్తున్న రెడ్డెప్పశెట్టి ఆక్రమణలు తొలగించకుండా ప్రవర్తిస్తున్న తీరుపై ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తం కావడంతో ఆయన లేఖను ఏపీఐఐసీ కొట్టిపడేసింది. తెలియక ఆక్రమణ చేశానని రెడ్డెప్పశెట్టి రాసిన లేఖ చూసి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని విస్మయం వ్యక్తం చేశారు. ఎవిక్షన్ ఇచ్చిన తర్వాత ఎలాంటి పరిస్థితుల్లోనూ తొలగించాల్సిందేనని తేల్చి చెప్పారు. ఆక్రమణలు తొలగించకపోతే చట్టపరంగా ముందుకెళతామని హెచ్చరించారు. ఇప్పటికే ఇదే అంశంపై ఆర్డీఓకు స్పష్టమైన లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపునకు రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరారు. కాగా చిత్రావతి నదిపై రెడ్డప్పశెట్టి అక్రమంగా నిర్మించిన బ్రిడ్జి వ్యవహారంలో రైతులందరూ కలిసి నిర్మించినట్లుగా హైకోర్టును ఆశ్రయించిన అంశంలో ఇరిగేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేసినట్టుగా తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన తీర్పు వెలువడే అవకాశం ఉంది.

అనంతలో మళ్లీ ఎడారి ఛాయలు

- అనంతపురం, కర్నూలు జిల్లాలకు 63 టీఎంసీల నీరు ఇవ్వాల్సిందే
- లైనింగ్ పనులతో రైతులకు నష్టం
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి


పంపనూరు వద్ద హంద్రీ-నీవా లైనింగ్ పనులను పరిశీలిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: సీఎం చంద్రబాబు తీరుతో జిల్లాలో మళ్లీ ఎడారి ఛాయలు అలుముకుంటున్నాయని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీ-నీవా కాలువలో లైనింగ్ పనులను రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి, మాట్లాడారు. హంద్రీ నీవా ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే మహోన్నత లక్ష్యంతో దివంగత నేత వైఎస్సార్ హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను చేపట్టారని గుర్తు చేశారు. 2015లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6 లక్షల ఎకరాలను రద్దు చేస్తూ జీఓ 22 ఇచ్చారన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెరువులతో పాటు 6 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలన్న ఉద్దేశంతో 63 టీఎంసీల ప్రవాహ సామర్థ్యంతో శ్రీశైలం డ్యాం మల్యాల నుంచి కాలువను వెడల్పు చేసేలా జీఓ ఇచ్చి, పనులు మొదలు పెట్టారన్నారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 3 టీఎంసీలు ఇచ్చి కర్నూలు ప్రజల దాహార్తిని తీర్చాలని, డోన్ ప్రాంతంలో 63 చెరువులకు2 టీఎంసీలు, శింగనమల, శింగనమల రూరల్ చెరువులకు 2.3 టీఎంసీలు కేటాయిస్తూ జీఓ ఇచ్చారన్నారు. అలాగే జీడిపల్లి నుంచి 3.7 టీఎంసీలు భైరవానితిప్ప ప్రాజెక్టుకు, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని చెరువులకు సంబంధించి 114 చెరువులకు నీరు ఇచ్చేలా కార్యాచరణను రూపొందించారన్నారు. పేరూరు డ్యాంకు జీడిపల్లి నుంచి నీళ్లు ఇస్తూ సోమరాండ్లపల్లి, పుట్టకనుమ, తోపుదుర్తి, ముట్టాల చెరువులకూ 4.3 టీఎంసీలు కేటాయించారన్నారు. పుట్టపర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా 193 చెరువులకు, కియో ఫ్యాక్టరీకి నీరు ఇచ్చే బృహత్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌లన్నీ రద్దు చేస్తూ నిధుల దుర్వినియోగానికి తెరలేపిందన్నారు. గతంలో అమిలినేని సురేంద్రబాబు కాలువ మీద 20 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అమ్ముకున్నారన్నారు. ప్యాకేజ్ 2లో రూ.9 కోట్ల పనులను రూ.95 కోట్లకు బిల్లులు చేసుకున్నారని తెలిపారు. ప్యాకేజి 3లో రూ.40 కోట్ల పనులకు సంబంధించి రూ.105 కోట్ల బిల్లులు చేసుకున్నారని వివరించారు. హంద్రీ నీవా కాలువ లైనింగ్‌పనులతో రైతులకు తీరని నష్టమన్నారు. కాలువను 63 టీఎంసీలతో అనంతపురం, కర్నూలు జిల్లాలకు పరిమితం చేయాలని, జగనన్న తీసుకొచ్చిన ప్రాజెక్టులను పూర్తి చేసి చిత్తూరు, కడప జిల్లాలకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిల్ల కాలువల నిర్మాణం చేపట్టి 6 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చే ఏర్పాటు చేసిన తరువాతనే లైనింగ్ పనులు చేసుకోవాలన్నారు. గండికోట నుంచి గాలేరు నగరికి అక్కడి నుంచి చిత్తూరు జిల్లాలో హంద్రీ నీవా పుంగనూరు బ్రాంచ్‌కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ కొనసాగించాలని దీనిని ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనలో భాగంగా గ్రామ సభలు నిర్వహించాలన్నా, పాదయాత్రలు చేయాలన్నా, సభలు పెట్టాలన్నా అధికారులు అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు అనుమతులు ఇచ్చినా ఇవ్వకపోయినా ఈ నెల 9న తోపుదుర్తి గ్రామంలో తన నివాసం వద్దనే వేల మంది రైతులతో నిరాహార దీక్ష చేపడుతానని ప్రకటించారు.

గుత్తి కోట ఉత్సవాలకు రూ.50 లక్షలు

గుత్తి: వచ్చే ఏడాది జనవరిలో గుత్తి కోట ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు గాను రూ.50 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని సోమవారం గుత్తి కోటపై నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల హాజరయ్యారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, జిల్లా పర్యాటక అధికారి విజయకుమార్, ఆర్డీఓ శ్రీనివాస్, పలువురు జిల్లా స్థాయి అధికారులు, కమిషనర్ జబ్బార్ మియా, తహశీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, మహర్షి దయానంద గురుకుల పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా చేయాలని, యోగాతో శారీరక రుగ్మతలు దూరమవుతాయని అన్నారు. అనంతరం కోటపై యోగాసనాలు వేశారు.

కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలి

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు/ఉరవకొండ: జిల్లాలోని ఆస్పత్రుల్లో కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆస్పత్రులోనూ కరోనా టెస్టింగ్ కిట్లు అందుబాటులో లేవన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోనే ఇలాంటి దుస్థితి ఉంటే ఇక రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ గూండాల దాడి


చికిత్స పొందుతున్న మారుతి

యాడికి: మండలంలో టీడీపీ గూండాలు బరితెగించారు. బోయరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మారుతిపై దాడికి పాల్పడ్డారు. సోమవారం మధ్యాహ్నం బోయరెడ్డిపల్లి నుంచి తన ద్విచక్ర వాహనంపై పెన్నా సిమెంటుకు బయలు దేరిన మారుతిని పరిశ్రమ సమీపంలో ఉన్న వంక వద్ద అదే గ్రామానికి చెందిన టీడీపీ గూండాలు అడ్డుకుని కట్టెలు, పైపులతో దాడి చేశారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన మారుతిని అటుగా వెళుతున్న వారు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో కుటుంబసభ్యులు చేర్పించారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు భోగాతి బ్రహ్మానందారెడ్డి, మల్లికార్జున, రామకృష్ణ తదితరులు అనంతపురంలోని ఆస్పత్రికి చేరుకుని మారుతిని పరామర్శించారు.

అడ్డుగా ఉన్నాడనే అంతమొందించారు

- ఏడాది క్రితం వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ
- ప్రియుడితో కలసి భర్తను హత్య చేయించిన భార్య


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఏడాది క్రితం చోటు చేసుకున్న వ్యక్తి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడితో కలసి భర్తను హతమార్చిన భార్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ రత్న, డీఎస్పీ హేమంత్ కుమార్ వెల్లడించారు. ధర్మవరంమండలం పోతుకుంట గ్రామానికి చెందిన మంజునాథకు రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన యమునతో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకు తెరువు కోసం పెనుకొండలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో పెనుకొండకు చెందిన సిద్దప్పతో యమునతో అయిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. విషయం తెలుసుకున్న మంజునాథ పలుమార్లు భార్యను హెచ్చరించాడు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో మంజునాథ్ తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో తరచూ భార్యతో గొడవపడేవాడు. దీంతో ఎలాగైనా భర్తను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న యమున... ఆ మేరకు సిద్ధప్పను ప్రభావితం చేసింది.

పథకం ప్రకారం హత్య..

యమునతో కలసి మంజునాథ్ హత్యకు కుట్ర పన్నిన సిద్ధప్ప 2024, ఏప్రెల్ 22న తన స్నేహితులు నూర్ మహమ్మద్, మదన్‌మోహన్, మోహన్‌తో ధర్మవరం మండలం నాగలూరు వద్ద ఉన్న పెద్ద వంకలో మద్యం పార్టీ ఏర్పాటు చేసుకుందామని మంజునాథ్‌ను పిలుచుకెళ్లాడు. అక్కడ మంజునాథ్‌కు అతిగా మద్యం తాగించి పథకం ప్రకారం టవాలును మెడకు బిగించి హత్య చేశారు. ఘటనపై కేసు నమోదు చేసిన ధర్మవరం రూరల్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో నిందితులను పసిగట్టారు. ఆదివారం సాయంత్రం పోతుకుంట గ్రామశివారులో తచ్చాడుతున్న ప్రధాన నిందితుడు సిద్దప్ప, నూర్ మహమ్మద్, మదన్‌మోహన్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేయడంతో నేరాన్ని వారు అంగీకరించారు. దీంతో ముగ్గురినీ అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మోహన్, యమున పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ రివార్డులు అందజేశారు.

చాగల్లు రిజర్వాయర్‌లో
అమ్మవారి విగ్రహం లభ్యం


చేపల వలకు చిక్కిన అమ్మవారి పంచలోహ విగ్రహం

పెద్దపప్పూరు: చాగల్లు రిజర్వాయర్‌లో అమ్మవారి పంచలోహ విగ్రహం లభ్యమైంది. పెద్దయక్కలూరు గ్రామానికి చెందిన కొందరు జాలర్లు ఆదివారం రాత్రి చేపల వేట కోసం చాగల్లు రిజర్వాయర్ దిగువ ప్రాంతంలో వలలు వేయగా 3 అడుగుల ఎత్తు దాదాపు 30 కిలోల బరువు ఉన్న పంచలోహపు అమ్మవారి విగ్రహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న పెద్దపప్పూరు గ్రామస్తులు అమ్మవారి విగ్రహాన్ని మేళతాళాలతో ఘనంగా ఊరేగించి చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉంచారు.

కర్ణాటక వాసి దుర్మరణం


మహమ్మద్ (ఫైల్)

పెద్దవడుగూరు: మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని రాయచూర్ నుంచి పేపర్ బెడ్స్ లోడ్‌తో వచ్చిన ఐచర్ వాహనం అనంతపురంలో అన్‌లోడ్ చేసి సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమైంది. కాశేపల్లి టోల్‌ప్లాజా దాటగానే డ్రైవర్ ఖలీల్ నిద్ర మత్తులో జోగడంతో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో రాయచూరు జిల్లా మాన్వికి చెందిన ఐచర్ క్లీనర్ మహమ్మద్ (31) అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుడి సోదరుడు యూనస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలీసు బండి.. జగమొండి



కళ్యాణదుర్గం: కొన్నేళ్ల క్రితం కళ్యాణదుర్గం అర్బన్ పీఎస్‌కు ఓ బొలెరో వాహనాన్ని అధికారులు కేటాయించారు. స్టేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత ఎస్‌ఐ పోస్టు లేకపోవడంతో సీఐ స్థాయి అధికారికి ఆ వాహనాన్ని కట్టబెట్టారు. అయితే తరచూ సాంకేతిక సమస్యలతో వాహనం కాస్త మొరాయించడం మొదలు పెట్టింది. దీంతో సోమవారం పెట్రోలింగ్‌కు వెళ్లేందుకు వాహనాన్ని స్థానికుల సాయంతో పోలీసులు తోయించి స్టార్ట్ చేయించాల్సి వచ్చింది. పోలీసుల అవస్థలను చూసిన ప్రజలు.. చిన్నపాటి మరమ్మతులు సైతం చేయించుకోలేని పోలీసుల తీరుపై 'ఎంతైనా సావాస దోషం' అంటూ చలోక్తులు విసిరారు.